

## మే 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జాతీయ న్యాయసేవాధికార సంస్థ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం తూర్పు గోదావరి జిల్లాలో మే 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తామని డిఎల్ఎస్ఎ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు రాజీపడ దగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం

- కల్వర్టు నిర్మాణాల వద్ద కానరాని సూచిక బోర్డులు
- ఆందోళనలో ప్రయాణికులు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వేళ్ల చింతలగూడెం, పెద్దాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు కల్వర్టులకు సూచిక బోర్డులు లేక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. గోపాలపురం నుంచి చిట్యాల వెళ్లే రోడ్డు మార్గానికి వేలచింతలగూడెం, పెద్దాపురం గ్రామాలలో కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో రెండు ప్రాంతాల్లో సుమారు రూ.60 లక్షలతో కల్వర్టు పనులు ప్రారంభించారు. నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ పనులే ప్రయాణికుల పాలిట ప్రాణ సంకటంగా మారాయి. పనులు ప్రారంభించి సుమారు రెండు నెలలు అయ్యింది. ఆయా ప్రాంతాల్లో ఎనిమిది మీటర్ల లోతు రోడ్డు కటింగ్ చేశారు. వాహనాలు వెళ్లేందుకు డైవర్షన్ ఇచ్చారు. రోడ్డు డైవర్షన్ ఇచ్చినప్పటికీ సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళలో ప్రయాణికులకు కనిపించేందుకు రేడియం బోర్డు, స్టిక్కర్లు, రిబ్బన్లు ఏర్పాటు చేయాలి కాని నామమాత్రంగా ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారే తప్ప పూర్తిస్థాయిలో సూచిక బోర్డులు లేవు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఒక కల్వర్టు వద్ద తాడిచెట్టును అడ్డంగా వేశారు. మరొక కల్వర్టు వద్ద మూడు ఇసుక బ్యాగులు, అందులో మూడు ఎర్రజెండాలు పెట్టి చేతులు దులుపుకున్నారు. అవి కూడా ఒక వైపే పెట్టారు మిగిలిన మూడు వైపుల అడ్డుగా ఎలాంటి ఏర్పాట్లు లేవు. రోడ్డు డైవర్షన్ ఉండడంతో ప్రయాణిస్తున్న వాహనాలు అదుపుతప్పి అందులో పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో అటుగా ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎలాంటి ప్రమాదం సంభవించకముందే సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు. రక్షణ చర్యలు చేపట్టాలని, కల్వర్టు పనులను వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు.








లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ కృతికా శుక్లా, డిసిసిబి చైర్మన్ వీర్రాజు

## 'ఇబిసి నేస్తం'లో 19,782 మందికి లబ్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇబిసి నేస్తం ద్వారా జిల్లాలో 19,782 మందికి రూ.29.67 కోట్ల మేర లబ్ధి చేకూరిందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. రెండో విడత వైఎస్ఆర్ ఇబిసి నేస్తం పథకాన్ని ముఖ్యమంత్రి జగన్ బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత, ఎంపీ మార్గాని భరత్‌రామ్, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో అగ్రవర్ణాల్లోని అర్హులైన పేదలను గుర్తించి ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్ఆర్ ఇబిసి నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. 45 - 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ పథకం అమలు చేస్తుందన్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడతగా జిల్లాలో 19,782 మంది లబ్ధిదారులకు రూ.29.67 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో తొలి దశలో 16,218 మంది లబ్ధిదారులకు రూ. 24.32 కోట్లు అందించామన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ అగ్రవర్ణాల్లోని పేద మహిళలను ఆదుకోవాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది లబ్ధిదారులకు రూ.659 కోట్లు అందించిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన సమాజిక వర్గాల్లోని పేద మహిళలందరినీ ఆర్థిక చేయూత నందించే దిశగా నేడు ముఖ్యమంత్రి భరోసాను కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి పి.సత్యరమేష్, ఎస్ఎబి.రాజకుమారి, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## 'జగనన్నే మా భవిష్యత్తు'తో ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన గృహ సారథులతో కలిసి వాలంటీర్లు ప్రతి వ్యక్తి నుంచి ప్రభుత్వ పాలనపై అభిప్రాయం సేకరణ చేయాలని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత సూచించారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం విజయవంతం చేసేందుకు గృహసారథులు, వాలంటీర్లకు నేలటూరు సీతారామ కళ్యాణ మండపంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వనిత పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలందరికి అందించడానికి వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. అనంతరం 'జగనన్నే మా భవిష్యత్తు' కిట్లను వాలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మట్టా వీరాస్వామి, వైసిపి గౌరవాధ్యక్షుడు జుట్టు ఏడుకొండలు, మండల అధ్యక్షుడు డాక్టర్ చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి జజ్జవరపు రామచంద్రరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు తాలూరు దామోదరావు, జి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

## సమస్యలపై ఎండియు ఆపరేటర్ల వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎండియు ఆపరేటర్లు బుధవారం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు వినతిపత్రం అందించారు. ఎంపీ మాట్లాడుతూ సక్రమంగా రేషన్ పంపిణీ జరగట్లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. బియ్యం ఇవ్వకపోగా డబ్బులు తీసుకోవాలని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది సరికాదన్నారు. ఎండియు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు ఆరే చిన్ని మాట్లాడారు. సాంకేతిక పరమైన సమస్యలు, ఎక్కడో ఒక చోట జరిగిన తప్పిదం వల్ల మొత్తం ఎండియు ఆపరేటర్లందరికీ మచ్చ పడుతోందన్నారు. నగరంలో మొత్తం 58 ఎండియు ఆపరేటర్లు ఉన్నారని, 108 రేషన్ షాపుల లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. ఒక్కొక్క ఎండియూ ఆపరేటర్ రెండు రేషన్ షాపుల వారికి సరుకులు అందించాల్సి వస్తుందన్నారు. నగరంలో ఏడుగురిపై 6ఎ కేసులు నమోదయ్యాయన్నారు. తమకు వచ్చే రూ.18 వేల వేతనంలో హెల్పర్‌కు రూ.6 వేలు, హమాలీలకు రూ.2వేలు, డీజిల్ ఖర్చు రూ.3 వేలు, వాహనానికి సాంకేతిక పరమైన ఇబ్బందులు, ఖర్చులు పోతే నెలకు రూ.5వేలు కూడా మిగలట్లేదన్నారు. కుటుంబ పోషణ కష్టంగా మారుతుందన్నారు. సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ జెసి, డీలర్లు, ఎండియు ఆపరేటర్లతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో ఎండియు ఆపరేటర్ల అసోసియేషన్ నాయకులు గారా శ్రీనాథ్, నక్కా శ్రీను, సుశాంత్ సింగ్, సతీష్, సునీల్, రమణ తదితరులు ఉన్నారు.

## తహశీల్దార్‌గా రాజ్యలక్ష్మి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం తహశీల్దార్‌గా కె.రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఆమె రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో సేవలందించారు. బదిలీపై చాగల్లు తహశీల్దార్‌గా వచ్చారు. ఆమె మాట్లాడుతూ మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని సక్రమంగా అమలు చేస్తామన్నారు. మండలంలో [illegible] గ్రామాల్లో రీ సర్వే పూర్తి అయ్యిందన్నారు. మండలంలోని మిగిలి గ్రామాల్లోనూ రీసర్వేను వేగవంతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా డిటి కె.నిరంజన్‌కుమార్, ఆర్ఐ ఆనంద్ కుమార్ తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు

ప్రజాశక్తి- గోకవరం

మండలంలో పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి బుధవారం తనిఖీలు చేశారు. వీరలంకపల్లి గ్రామంలో అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అలాగే పాఠశాల సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఇఒ బి.గౌరమ్మ, సిడిపిఒ ఝాన్సీరాణి, ఎసిడిపిఒ వరలక్ష్మి, తహశీల్దార్ శ్రీనివాస్, డిఎస్ఒ త్రినాథరావు, సూపర్‌వైజర్ ఇందిరా రాణి, అంగన్‌వాడీలు, సిబ్బంది ఉన్నారు.



అంగన్‌వాడీ రిజిస్టర్లను పరిశీలిస్తున్న కమిషనర్

## 110 మందికి దంత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరులో బుధవారం నిర్వహించిన దంత వైద్య శిబిరంలో 110 మందికి దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ బివి.రాజు విష్ణు దంత వైద్య కళాశాల సిబ్బంది ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపిటిసి సభ్యులు కోలా లక్ష్మీపార్వతి, సీతయ్య నాయుడు ఆర్థిక సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 65 మందికి దంతాల క్లీనింగ్, 18 మందికి సిమెంట్ ఫిలింగ్ చేశామని డాక్టర్ ఆదిత్య తెలిపారు. 27 మందిని తదుపరి చికిత్సకు రిఫర్ చేశామన్నారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ భావన మధు పూర్ణచంద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అరిగెల అరుణకుమారి, ఎం.బాబూజీ, ఒంటెద్దు గోవిందరాజులు నాయుడు, శిరిగినీడి శేషగిరిరావు, సలాది ఉదయభాస్కరరావు, అడపా బాలసుబ్రహ్మణ్యం, బి.రాజు, టి.సురేష్ పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తికి సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అన్నదేవరపేటకు చెందిన ములపర్తి దీవెనకుమార్‌కు మానవత సంస్థ బుధవారం రూ.5వేల ఆర్థిక సాయం అందించింది. అలాగే సంస్థ సభ్యులు చెరుకూరి బంగారుబాబు, కవల రామాంజనేయులు రూ.వేయి చొప్పున, మేకా శ్రీనివాస్ రూ.500 బాధితునికి సాయం అందించారు. ఈ సందర్భంగా సంస్థ మండల అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు మాట్లా డారు. విద్య, వైద్య అవసరాలతో పాటు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ తమ సేవ సంస్థను అన్నివేళలా ఆశ్రయించొచ్చ న్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, సభ్యులు బాలనాల శంకర్, ఇంజరపు వెంకటకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికా బద్ధంగా జెవికె కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ ఏడాది ప్రణాళికా బద్ధంగా జెవికె కిట్లను పంపిణీ చేయనున్నామని అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచేనాటికే విద్యార్థులకు 'జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జెవికె కిట్ల పంపిణీ నిమిత్తం నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐ మాట్లాడారు. నాలుగో విడత జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ నిమిత్తం మండల స్థాయిలో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీకి డిఐ చైర్మెన్‌గా ఉంటారన్నారు. కన్వీనర్‌గా ఎస్‌కెవిటి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంవిఎం.సుబ్రహ్మణ్యం నియమితులు అయ్యారన్నారు. ఇతర సభ్యులుగా ఇద్దరు ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, మండల విద్యాశాఖ కార్యాలయ ఎంఐ ఎస్ కో ఆర్డినేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్, సిఆర్‌పిలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్, ఐఇఆర్టి టీచర్ మొత్తం 48 సభ్యులతో కమిటీ ఉంటుందన్నారు. కిట్ల పంపిణీకి ఏర్పాట్లు, సంసిద్ధత, కాంప్లెక్స్ స్థాయిలో సరఫరా చేసేందుకు రూట్ మ్యాప్, వాటి భద్రత అంశాలు, బాధ్యతలు వంటివాటిపై చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు టి.చక్రధర్, కెవివి.సత్యనారాయణ, సిఆర్‌పిలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఐ దిలీప్‌కుమార్

## గ్రంథాలయం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు చర్చ్‌పేటలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని 'పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ మేనేజర్ బి.శ్రీలక్ష్మికి బుధవారం వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడారు. చర్చ్‌పేటలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు ఎక్కువగా ఉన్నారన్నారు. స్థానిక పాఠశాలలోనే వీరి పిల్లలు చదువుకుంటున్నారన్నారు. చాలా మంది నిరుద్యోగ యువత కూడా ఇక్కడ ఉన్నారన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి మెటీరియల్ ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుందన్నారు. దగ్గరలో గ్రంథాలయం కూడా లేక వారు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ గ్రంథాలు, పుస్తకాలు ఇచ్చేందుకు దాతలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రెండు అంతస్తులతో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఒక గదిని గ్రంథాలయానికి కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గండి శ్రీనివాసరావు, టి.నాని, కె.ప్రసాద్, పి.సుధాకర్ ఉన్నారు.

## 3వేల మందికి అన్నదానం

**గోపాలపురం :** ఉప్పరగూడెంలోని సీతారామ స్వామి ఆలయం వద్ద బుధవారం 3వేల మందికి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు ఈ అన్నదానంలో పాల్గొన్నారని తెలిపారు.

## ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

**ఉండ్రాజవరం, తాళ్లపూడి :** చివటంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ కొఠారు సత్యనారాయణ గృహసారథులు, వాలంటీర్లతో కలిసి ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. వాటి అమలుతీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో మన్నే త్రిమూర్తులు, ఎం.మురళీకృష్ణ, జి.చిన్నవెంకన్న, సచివాలయ కన్వీనర్ కోలా లక్ష్మీగణపతి, ఎల్.పెదకాపు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు. తాళ్లపూడి మండలం పైడిమెట్టలో కార్యక్రమాన్ని ఎంపిపి జొన్నకూటి పోసిరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రజలకోసం అమలు చేస్తుందన్నారు. ఈ మేరకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించామన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత వైసిపికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో యాళ్ల బాబూరావు, ముళ్ల పోసిబాబు, ప్రక్కిలంక సచివీలయ కన్వీనర్ కొల్లి దుర్గారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. పెద్దేవంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు

## నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - రాజానగరం

సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా లబ్ధిదారులకే ప్రభుత్వం అందిస్తుందని ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. కొత్త తుంగపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ. 48 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడారు. ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట మందారపు వీర్రాజు, కోలపాటి వెంకన్న, గండి నానిబాబు, ఉల్లంగి సూర్యనారాయణ, ఆర్.లక్ష్మీపతి చక్రధర్, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - పెరవలి

మండలం ముక్కా మల శివారు ఓదూరివారి పాలెంలో ఇటీవల మృతి చెందిన రేలంగి రాముడు, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, ఎస్.లక్ష్మి కుటుంబాలను, ఎంపిటిసి మాజీ సభ్యులు రేలంగి ఏసు కుటుంబ సభ్యులను టిడిపి నిడదవోలు నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు బుధవారం పరామర్శించారు. మృతులకు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యలకు సానుభూతిని ప్రకటించారు. ఆయన వెంట నియోజ వర్గ ఐటిడిపి అధ్యక్షుడు అబిశెట్టి సత్తిరాజు, గ్రామ అధ్యక్షుడు వేంద్ర వెంకటరామమూర్తి, ఎంపిటిసి మాజీ సభ్యులు అక్కిన గంగాధర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

## మిథున్‌రెడ్డిని కలిసిన చక్రవర్తి, గిరజాల బాబు

ప్రజాశక్తి-కడియం

వైసిపి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డిని జెసిఎస్ కడియం మండల అధ్యక్షులు తాడాల చక్రవర్తి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు బుధవారం విచ్చేసిన మిథున్ రెడ్డిని కలిసి మొక్కను అందజేశారు. మండలంలో జరుగుతున్న జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం వివరాలను చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, దుల్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాస్, సాపిరెడ్డి సూరిబాబు, సాపిరెడ్డి కామేష్, బోడపాటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు .

## ధ్రువీకరణ పత్రాలు అందించాలి

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో వ్యవసాయ భూమి ఉన్న రైతులందరూ పాస్ పుస్తకం, దస్తావేజులు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలను విఆర్‌ఒలకు అందించలని డిప్యూటీ తహశీల్దార్ కె.నిరంజన్‌కుమార్ సూచించారు. ఇప్పటికే వీటిని అందించిన వారు తిరిగి అందించాల్సిన అవసరం లేదన్నారు. దీనికి రైతులందరూ సహకరించాలన్నారు.

## వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని కోర్టుల ప్రాంగణంలో వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైసిపి నగర అధ్యక్షుల అడపా శ్రీహరి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ న్యాయ వాదులు, కక్షిదారుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తొలిరోజు 100 మంది న్యాయవాదులు, 300 మంది కక్షిదారులకు చెరకు రసం, బటర్‌మిల్క్‌ను అందించారు. అనంతరం న్యాయవాదులు ఎంపీ భరత్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు సాధిక్ హుస్సేన్, లీగల్ సెల్ సభ్యులు పివిబిఎస్.రాజు, హసీనా బేగం, వైసిపి నాయకులు స్టాలిన్, రామారావు చౌదరి, అబ్దుల్ ఆరిఫ్, కాశి శ్రీనివాస్, యార్లగడ్డ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఒలింపియాడ్‌లో 'సూర్య చంద్ర' ప్రభంజనం

ప్రజాశక్తి - సీతానగరం

ఒలింపియాడ్‌లో సూర్య చంద్ర విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ లక్ష్మీప్రసన్న తెలిపారు. సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన కాంపిటీటివ్ పరీక్షల్లో 462 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. లెవిల్ - 2లో కూడా మొదటి 10లోపు ర్యాంకులను పలువురు విద్యార్థులు సాధించారు. గణితంలో నలుగు విద్యార్థులు 1,3,5,7 ర్యాంకులు, ఇంగ్లీష్‌లో ముగ్గురు విద్యార్థులు 1, 2, 6 ర్యాంకులు సాధించారు. గత వారం ప్రకటించిన సైన్స్ ఒలింపియాడ్ లెవిల్ - 2 లో 52 మంది విద్యార్థులలో 10 బంగారు పతకాలు, 12 వెండి పతకాలు, 7 కాంస్య పతకాలు సాధించారు. గణితంలో లెవిల్ - 2కు ఎంపికైన 71 మంది విద్యార్థుల్లో 12 బంగాణ పతకాలు, 14 వెండి పతకాలు, 9.కాంస్య పతకాలు సాధించారు. ఇంగ్లీష్ లెవిల్ - 2కి ఎంపికైన 43 మంది విద్యార్థులలో 5 బంగారు పతకాలు, 7 వెండి పతకాలు, 6 కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్యచంద్ర పాఠశాల ఛైర్మన్ కనికి రెడ్డి, హెచ్ఎం ఫణీంద్ర, కె. రామకష్ణ మరియు ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - గోపాలపురం

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలను బుధవారం గోపాలపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జడ్‌పి మాజీ చైర్మన్ ఇమ్మణి రాజేశ్వరి, టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు, నాయకులు అడుసుమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించి కోట్లాది మంది మనసులో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్ అన్నారు. బ్రిటిష్ వారి విధించిన భూమిశిస్తు విధానాన్ని రద్దుచేసిన ఘనత ఎన్‌టిఆర్‌కె దక్కిందన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలలకే అధికారంలోకి రావడం గొప్ప విషయం అన్నారు. ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పించారన్నారు. కాని నేడు రాష్ట్రంలో సైకో పరిపాలన సాగుతుందన్నారు. కేంద్ర నిధులు, పంచాయతీ నిధులు దోచేస్తున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి ఏడుసార్లు పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. ముఖ్యమంత్రి ఫోటోలతో కూడి స్టిక్కర్లు ఇంటింటికీ అంటించారని, వాటిని కుక్కలు పీకుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి బ్యారేజ్ స్థాయికి తీసుకొచ్చారన్నారు. పోలవరం, చింతలపూడి, తాడిపూడి పనులు నిలిచిపోయాయన్నారు. పంచాయతీల్లో ముగ్గు వేయడానికి కూడా డబ్బులు లేవన్నారు. సైకో విధానాలతో విసుగు చెందిన సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే తిరుగుబాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పెట్టుబడదారులు, కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపిని అధికారంలోకి తేవాలన్నారు. అనంతనం 20 మంది నాయకులను సత్కరించారు. 300 మందికి చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నున్నా మోహన్‌రావు, ఉండవల్లి బోస్, మేణి రత్నాజీ, ఆంధ్రు అనిల్, చదలవాడ ప్రసాద్, ఎంట్రప్రగడ మంగారావు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బుచ్చియ్యచౌదరి

## విద్యాశాఖాధికారి తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - కడియం

మండలంలో విద్యాశాఖాధికారి తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో పుష్కర కాలానికి పైగా తిష్టవేసి, ప్రయివేటు విద్యాసంస్థల యజమాన్యాలకు కొమ్ముగాస్తున్నారని పలువురు అంటున్నారు. ఒంటిపూట బడులు , అక్రమ ఫీజుల వసూళ్లు తదితర అంశాలపై పట్టించుకోవట్లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సుదీర్ఘకాలంగా ఆ శాఖలో గల అన్ని అవకాశాలను తనకు అనుకూలంగా మార్చుకుంటూ, మండలంలోని అన్ని పార్టీల నాయకులను ప్రసన్నం చేసుకుంటూ పబ్బంగడుపుతున్నారని అంటున్నారు. ఉపాధ్యాయుల పనితీరు, ఉత్తీర్ణతా శాతం పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని వారంటున్నారు. వచ్చామా..., వెళ్లామా అన్నట్టు ఆయన వ్యవహార శైలి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జేగురుపాడులో ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మద్యం సేవించి విధులకు హాజరవుతున్న విషయాన్ని సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ బయట పెట్టిన విషయం తెలిసిందే. అలాగే దుళ్ల హైస్కూల్లో విద్యార్థులు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని పలువురు అంటున్నారు. ఇలాగే ఉంటే మండలంలో విద్యావ్యవస్థ కుంటు పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కార్టూ'నిజం'



# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం శివారు మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కోమటికుంటకు చెందిన పొనుగుమాటి నాగేంద్ర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం గోపాలపురం వచ్చి పనులు ముగించుకొని అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో బైకుపై ఇంటికి బయలు దేరాడు. గోపాలపురం శివారుకు వచ్చే సరికి టాటాఏస్ వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగేంద్ర(29) అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై ఎస్ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహానిన కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## కాలువలో యువకుని గల్లంతు


ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సరదాగా స్నేహితులతో కలిసి కాలువలో ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాద వశాత్తూ గల్లంతయ్యాడు. ఈ ఘటన చివటం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్నేహితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు నల్లజర్లకు చెందిన మందపాటి జాన్ ఆశిష్ ఇటీవల తణుకు వెళ్లాడు. బుధవారం స్నేహితులతో కలిసి గోస్తనీ నదిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతున్న వారితో పాటు ఆశిష్ కాలువలోకి దూకి గల్లంతయ్యాడు. స్నేహితుల సమాచారం మేరకు చివటం విఆర్ఒ ఎ.రాజశేఖర్, మహిళా పోలీస్ కె.మేరీకుమారి, ఉండ్రాజవరం పోలీసులు, తణుకు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

## పిల్లల కిడ్నాప్ వదంతులు నమ్మొద్దు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం శివారు మందులు కాలనీలో ఇద్దరు పిల్లలు కిడ్నాప్ గురయ్యారని, ఏడుగురు పిల్లలు తీసుకుపోయే గ్యాంగ్ ఏలేశ్వరంలో తిరుగుతోందని మంగళవారం సాయంత్రం పుకార్లు రావడంతో పిల్లల తల్లి, తండ్రులు భయాందోళనకు గురయ్యారు. మందులు పేటలో ఆడుకుంటున్న పాపను ఒక మతిస్థిమితం లేని వ్యక్తి ఎత్తుకోవడానికి ప్రయత్నించడంతో ఆ ప్రాంతవాసులు అతనిని దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టేశారు. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మేరకు ఏలేశ్వరం ఎస్ఐ జి సతీష్ మాట్లాడుతూ మందులు కాలనీ నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను మండపేట మండలం ఆర్తమూరు గ్రామానికి చెందిన కండే పెద్దగా గుర్తించామన్నారు. అతని కుటుంబ సభ్యులను రప్పించి విచారించగా, అతనికి పది సంవత్సరాల క్రితం వాహమైందని ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారన్నారు. భార్య భర్తలు మధ్య వివాదంతో మూడు సంవత్సరాల క్రితం విడిపోయారని, అప్పటినుంచి పెద్ద మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడన్నారు. తనకు పెళ్లి చేయాలని కనిపించిన వారిని అందరిని అడుగుతాడని తెలిపారు. పిల్లని కిడ్నాప్ ఎందుకు చేశావ్ అని అడగ్గా పిల్ల పడిపోతుంటే పట్టుకున్నానని సమాధానం ఇచ్చాడు అని చెప్పారు. ఇటువంటి వాదంతులను ఎవరు నమ్మొద్దని అనుమానం ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ కోరారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపిపి దొరబాబు

## బాటసారుల దాహార్తి తీర్చండి

ప్రజాశక్తి - గండేపల్లి

రోజు రోజు కి పెరుగుతున్న ఎండ తీవ్రతకు దారిని పోయే బాటసారులకు తాగునీరు అందించడమే ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపిపి చలగల దొరబాబు అన్నారు. బుధవారం గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామంలో జాతీయ రహదారి పక్కన దొమ్మ వెంకటరాజు జ్ఞాపకార్థంతో వారి కుమారుడు ఉప సర్పంచ్ దొమ్మాశీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల అధ్యక్షులు చెలగల దొరబాబు ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, గ్రామ నాయకులు, హెచ్ఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమాజానికి లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ అధ్యక్షులు, సి.హెచ్.సి. డైరెక్టర్ బిళ్లకుర్తి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో చిట్టూరి కృష్ణ లయన్స్, ఆర్య జననీ ట్రస్ట్ ద్వారా ప్రతి బుధ వారం గర్భిణులకు అందించే ఉచిత భోజన సదుపాయ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ సతీష్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఫర్ ఏ చేంజ్ సహకారంతో సమకూర్చిన గర్భిణులకు డెలివరీ సమయంలో ఉపయోగపడే కానెల్స్‌ను ఎంఎల్ఎ పొన్నాడ ఆసుపత్రి గైనకాలజిస్ట్ స్రవంతికి అందించారు. అనంతరం సి.హెచ్.సి.లో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఎంఎల్ఎ పొన్నాడ సందర్శించి నిర్వాహకులను అభినం దించారు. కార్యక్రమంలో పొన్నాడ భైరవమూర్తి, ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, కుడుపూడి శివన్నారాయణ, దున్న జనార్ధన రావు, చిట్టూరి కష్ణ కుటుంబ సభ్యులు, సి.హెచ్.సి. డాక్టర్ శిరీష, అద్దంకి లక్ష్మీ నారాయణ, లయన్స్ క్లబ్ నాయకులు వేలూరి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులు మానుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

పారిశుధ్య కార్మికులపై అవగాహన లేని సచివాలయం కార్యదర్శుల వేధింపులు ఆపాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధ సంఘం సామర్లకోట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా ప్రథమ మహాసభ కరపత్ర ఆవిష్కరించి, ధర్నా నిర్వహించారు. తోకల ప్రసాద్ మాట్లాడుతూ . ఈ నెల 15న జరుగనున్న పారిశుధ్య కార్మికుల కాకినాడ జిల్లా ప్రథమ మహాసభకు మున్సిపల్ కార్మికులు, పురపాలక సంఘం, నగర పంచాయతీ, వాటర్ వర్క్స్, డేటా ఆపరేటర్స్, పార్కు, స్ట్రీట్ లైట్స్ రంగాలు కార్మికులందరూ తరలిరావాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ది రెడ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

# యానాం వార్తలు



సమావేశంలో కలెక్టర్ వల్లవన్, ఎమ్మెల్యే అశోక్, ఆర్ ఏ ఓ మునిస్వామి, మాజీ మంత్రి మల్లాడి, అధికారులు

## కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ డ్రాఫ్ట్ పై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న కరైకల్,మాహే,యానాం నాలుగు రీజియన్లలో వాతావరణ శాఖకు సంబంధించి సముద్ర,నది తీరాలలో కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకై 2019 సిఆర్జెడ్ నిబంధనల మేరకు పుదుచ్చేరి ప్రభుత్వం కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ ప్లాన్ (సీజెడ్ఎంపీ) ను తయారుచేస్తున్న నేపథ్యంలో కాలుష్య నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ నగర్ మున్సిపల్ కల్యాణ మండపంలో ప్రాంతీయ పరిపాలన అధికారి ఆర్ మునిస్వామి అధ్యక్షతన బుధవారం సమావేశం ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్ హాజరయ్యారు. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావులు పాల్గొని వారి అభిప్రాయాలను కలెక్టర్ వల్లవన్ కు వివరించారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు వారి అభిప్రాయాలు తెలియజేసి వినతి పత్రాలు అందించారు. ముందుగా కాలుష్య నియంత్రణ కమిటీ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తీర ప్రాంత ప్రజలకు జరిగే లాభనష్టాలపై అవగాహన కల్పించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు.పూర్తిస్థాయిలో వారి అభిప్రాయాలను క్షుణ్ణంగా పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కనకాల రామదాసు,విష్ణువర్ధన్‌రావు, మల్లాడి శామ్యూల్, నామాడి అప్పారావు, గిడ్ల చంద్రరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన

యానాం నియోజకవర్గంలో పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్ బుధవారం పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్, ఆర్ ఏ ఓ మునిస్వామితో కలిసి పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆయన సందర్శించారు.దానిలో భాగంగా మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆసుపత్రి, సుభాష్ చంద్రబోస్ ఐటిఐ కళాశాల, కనకాల పేట నూతన ఇండోర్ స్టేడియం,సబ్ స్టేషన్ వద్ద డంపింగ్ యార్డ్ ప్రదేశాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.

### మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132 వ జయంతి పురస్కరించుకుని ఈరోజు ఉదయం 9 గంటల నుండి స్థానిక ప్రభుత్వ ఎస్ టి పి జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కార్యకర్తలకు అభిమానులకు పిలుపునిచ్చారు. రక్తం లేక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని వారిలో కొందరినైనా మనం కాపాడుకుందాం అని యానాం పరిసర ప్రాంత యువతి యువకులు పాల్గొని రక్త దానం చెయ్యాలని అయన కోరారు.

### షార్ట్ సర్క్యూట్‌తో టిప్పర్ దగ్ధం

యానాం గోపాల్ నగర్ రోడ్డులో బుధవారం టిప్పర్ (లారీ) డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యుత్ తీగలను గమనించకుండా ఎర్ర గ్రావెల్ అన్లోడ్ చేస్తూ పైన ఉన్న హెచ్‌డి వైర్లు లారీ బాడీకి తగలడంతో పెద్ద మంటలు ఏర్పడి లారీ టైర్లు,వైరింగ్ పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. లారీ నుండి డ్రైవర్ తప్పించుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సుమారు మూడు లక్షల నష్టం ఉంటుందని అంచనా వేశారు. అయితే దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి

ప్రజాశక్తి - జగ్గంపేట

వైఎస్ఆర్ పార్టీ నియోజకవర్గంలో మరింత బలపడటానికి ప్రతి ఒక్కరు మరింత కృషి చేయాలని రీజనల్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో పర్యటనలో భాగంగా జగ్గంపేట పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. 2014 నుండి నియోజకవర్గంలో ప్రజలు పార్టీ గెలవడానికి ఎంతో సహాయపడ్డా రన్నారు అదే విధంగా వచ్చే ఎన్నికల్లో కూడా పార్టీ అత్యధిక మెజార్టీ అన్ని స్థానాల్లోనూ పార్టీ శ్రేణులు కలిసి పాటుపడాలన్నారు. అలాగే నియోజకవర్గంలోని ఎంఎల్ఎ చంటిబాబు తన వంతు కృషి చేస్తున్నారని ఆయనకు పార్టీలో మంచి పేరు ఉందని ఆయన అన్నారు. జగ్గంపేట ఎంపిపి అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి, జగ్గంపేట జడ్‌పిటిసి బింరు మాధవి, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా ఆధ్వర్యంలో పలువురు వైసిపి పార్టీలోకి చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**-రూ.2.15 కోట్ల నాడు నేడు నిధులతో పి.హెచ్.సి కి భూమి పూజ**

గండేపల్లి మండలం సూరంపాలెంలో నాడు నేడు నిధులు రెండు కోట్ల పదిహేను లక్షలతో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులు కురసాల కన్నబాబు, ఎంపి వంగా గీత, జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబులు మాట్లాడుతూ దేశంలోని ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి చేల గర్భ దొరబాబు, వైఎస్ఎంపిపి కుంచే రాజా, జడ్‌పిటిసి సభ్యులు పరిమి వెంకటలక్ష్మి, మంగాయారు బాబు సూరంపాలెం గ్రామ సర్పంచ్ మేడిశెట్టి గంగాభవాని ఏఎంసి చైర్మన్ జనపరెడ్డి బాబు, ఒమ్మి బిందుమాధవ రఘురాం,వివిధ గ్రామాల ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.



సూరంపాలెంలో పిహెచ్‌సి నిర్మాణానికి శంకుస్థాపనచేస్తున్న మిథున్‌రెడ్డి, మంత్రి రాజా, వైసిపి నాయకులు

పెద్దాపురం అర్బన్ వైశ్య కళ్యాణ మండపంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అధ్యక్షతన వైయస్ఆర్‌సిపి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ముఖ్య అతిథిగా ప్రసంగించారు.సమావేశంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు,వైస్ చైర్మన్ లు నెక్కంటి సాయి ప్రసాద్,కనకాల మహాలక్ష్మి, జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎన్ ఛారిటీస్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక జగన్నాధపురం ఎంఎస్ఎన్ చారిటీస్ ప్రాంగణంలో రూ.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన రహదారిని ఎంపి వంగా గీత, కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అధ్యక్షత వహించిన సంస్థ చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ మాట్లాడుతూ రహదారిని నిర్మించడానికి సహకరించిన ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ ఆశయ సాధనకు నిరంతరం సహకరిస్తానని తెలిపారు. ఈ సంవత్సరం డిసెంబర్ లోపు ఆట స్థలం పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్ర కళ దీప్తి కుమార్, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, అసిస్టెంట్ కమిషనర్, ఇఒ పి.బాబూరావు, మాజీ డిప్యూటీ మేయర్ వోడిపల్లి వెంకట సత్య ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె. ఉమామహేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్. విజయకుమార్, హెచ్ఎం ఎంఎస్ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కోనసీమ విద్యా సైన్స్ అధికారి జి వి.ఎస్. సుబ్రమణ్యం చక్రవర్తి వాజ్యం, బాలచేడ కన్వీనర్ నోరి బలరామకృష్ణ పాటలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## ప్రజలకు పభుత్వేతర సంస్థల సేవలు కీలకం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజలకు అందిస్తున్న సేవలలో ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జిఒ)పాత్ర చాలా కీలకమని కాకినాడ ఎంపివంగా గీత అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ నగర్‌లోని చల్లా కళ్యాణమండపంలో దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్, తోట సుబ్బారావు రూరల్ అభివృద్ధి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపి గీత జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి చెవి పరికరాలు అందజేశారు. నిర్వహించిన అవసరమైన వారికి నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ సంస్థ (ఎన్ఎఫ్ఎల్) సమకూర్చిన వినికిడి యంత్రాలను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎంపి గీత మాట్లాడుతూ పలు ప్రభుత్వేతర సంస్థలు సిఎస్ఆర్ నిధులను అందించి అనేక విధాలుగా అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యమవుతున్నట్లు గీత చెప్పారు. ఎన్ఎఫ్ఎల్ డిప్యూటీ జిఎం సంజీవ రణదేవ్ మాట్లాడుతూ తాము కాశ్మీర్ నుండి అన్ని రాష్ట్రాల్లో సిఎస్ఆర్ నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దీన్ దయాల్ ఫౌండేషన్ రాష్ట్ర చైర్మన్ రేగుల రామాంజ నేయులు, తోట సుబ్బారావు రూరల్ అభివృద్ధి ట్రస్ట్ అధ్యక్షుడు తోట సర్వారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భూ సార పరీక్షలు అవసరం

- వ్యవసాయశాఖ జెడి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పంటను వేసే ముందే మట్టి నమూనాను పరీక్షించుట ద్వారా ఆ నేలలో తగిన పోషకాలు తెలుసుకుని పంట వేసినట్లయితే తగిన పోషక పదార్థాలను ఎరువుల రూపంలో అందించుటకు భూ సార పరీక్షలు కీలక పాత్ర పోషిస్తాయని కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సామర్లకోట వ్యవసాయ విస్తరణ శిక్షణ కేంద్రంలో జిల్లా పరిధిలో భూ సార పరీక్ష శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలోని వ్యవసాయాధికారులకు, ఏడిఎలకు, మండలంలోని ఒక వివిఎలతో ప్రయోగాత్మక అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ జిల్లా పరిధిలో నేల రకాలు, స్వభావం, సమస్యాత్మక భూముల మట్టి నమూనాలు సేకరణ పెద్ద ఆ నిర్వహణ విధితో జతచేయు పత్రాలు, మట్టి నమూనాల సేకరణ, విశ్లేషణ అంశములపై శిక్షణ ఇచ్చారు. డాట్ శాస్త్రవేత్త బాలాజీ నాయక్, డిటిసి డిఆర్‌సి బివివిఎస్ హరి, డిఆర్‌సి ఎడిఎ ఎ మాధవి, భూసార పరీక్షా కేంద్రం ఏవోలు, సామర్లకోట మండల వ్యవసాయ ధికారి ఇమ్మిడిశెట్టి సత్య, ఎఇలు, ఎడిఎలు, వివిఎలు హాజరయ్యారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -కరప

మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి. ఆదిలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం పెద్దాపురప్పాడు, కొంగోడు, పేనుగుదురు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు, మెనూను పరిశీలించారు. పిల్లలను మానసికంగా సంసిద్ధత చేసే ఆటపాటలతో విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. మిషన్ వాత్సల్య గడువు తేదీ పొడిగించడానికి, అక్రమ రవాణా బాధిత మహిళలకు తమ భర్తల నుండి విడిపోయిన వారికి ఆధారాలు అడగకుండా చూడాలని కోరుతూ తమ కమిషన్ నుండి రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ, సెంట్రల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు ఆమె తెలిపారు. సిడిపిఒ జి వెంకట రమణమ్మ సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసరా లబ్దిదారులకు బయోమెట్రిక్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం గౌరీ కోనేరు కాలనీలో బుధవారం మెప్మా సిఎంఎం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 14 డ్వాక్రా గ్రూపులకు చెందిన 140 మంది మహిళలకు జగనన్న ఆసరా బయోమెట్రిక్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయోమెట్రిక్ పూర్తయితేనే ఆసరా చెక్కులు ఎకౌంట్లో నమోదవుతాయన్నారు కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీదేవి, రిసోర్స్ పర్సన్ పల్లంకుర్తి నాగమణి పాల్గొన్నారు.

## వినికిడి పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో వినికిడి లోపం ఉన్న ముగ్గురు బాలలకు బుధవారం విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి పరికరాలు పంపిణీ చేశారు. ఐ ఈ కోఆర్డినేటర్,సి ఎం ఓ చామంతి నాగేశ్వరరావు, దుర్గా ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కొండపల్లి గ్రామంలో ఏడు రోజులు పాటు నిర్వహించే ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు గ్రామ పంచాయతీ పరిస రాల్లో,, చెరువు గట్టు దగ్గర మొక్కల్ని నాటారు. కొండపల్లి సర్పంచ్ కొత్త చక్రారావు, సిబ్బంది పాల్గొన్నారు.



# డిపిఒ విచారణలో ఉద్రిక్తత

- సచివాలయంలో ఘర్షణకు దిగిన జనసేన, వైసిపి
- పి.వేమవరంలో పోలీస్ పికెట్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పంచాయతీ చేపల చెరువు వేలం నిర్వహణ, ఆదాయం జమలో అవకతవకలు జరగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ విచారణ నిర్వహిస్తుండగా, వైసిపి గ్రామ మహిళా సర్పంచ్ వర్గీయులు, ఫిర్యాదు చేసిన జనసేన వర్గీయులు ఘర్షణకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక దశలో డిపిఒ, డిఎల్‌పిఒ, అధికారులు బయటకు వెళ్లిపోగా రెండు గ్రూపులు ఘర్షణకు దిగి సచివాలయంలో వున్న ఫర్నీచర్, కుర్చీలను చిందర వందర చేశారు. గ్రామానికి చెందిన జనసేన పార్టీకి చెందిన మేడిద విఘ్నేశ్వర నాగబాబు చెరువు అక్రమాలపై విచారణ చేపట్టాలని, అనారోగ్యం బారిన పడకుండా గ్రామస్తులకు రక్షణ కల్పించాలని పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేసి, సమాచార చట్టం ద్వారా దరఖాస్తులు చేసి సమచారం తీసుకున్నారు. ఈ ఫిర్యాదుపై ఇటీవల కాకినాడ డిఎల్‌పిఒ అమ్మాజీ నిర్వహించిన విచారణ నివేదిక సంతృప్తికరంగా లేదని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, పునర్విచారణకు కలెక్టర్ కృతికా శుక్లా డిపిఒ విక్టర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం పి.వేమవరం సచివాలయంలో పిర్యాదు దారుడు, గ్రామ సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం, మాజీ సర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొర, వార్డు సభ్యులను పిలిపించి డిపిఒ విక్టర్ విచారణ ప్రారంభించారు. విచారణ జరుగుతుండగా ఫిర్యాదుదారు, సర్పంచ్ వర్గీయులు ఒకరిపై ఒకరు పెద్దగా కేకలు వేసుకుని ఘర్షణకు దిగారు. పరిస్థితి బాగోకపోవడంతో డిఎల్‌పిఒ, డిపివో అమ్మాజీ, ఇన్‌చార్జి ఇఒపిఆర్‌డి వై శ్రీహరి, కార్యదర్శి బుల్లియ్యకాపు తదితర సిబ్బంది సచివాలయం నుండి బయటకు వచ్చేశారు. దాంతో ఇరు వర్గాలు సచివాలయం తలుపులు వేసి ఒకరిపై ఒకరు కేకలు వేసుకొంటూ సచివాలయంలో పర్నీచరు, కుర్చీలు ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో పెద్దాపురం సిఐ అబ్దుల్ నబి, తిమ్మాపురం ఎస్ఐ నాగార్జున, సామర్లకోట మహిళా ఎస్ఐ తోట సునీత, సిబ్బంది చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి బుల్లియ్యకాపును వివరణ కోరగా, విచారణలో ఆరుపులు కేకలు వేసుకోవడంతో తాము బయటకు వచ్చేశామని, లోపల ఏమి జరిగిందో చూడలేదన్నారు. జరిగిన సంఘటనపై కార్యదర్శి, సర్పంచ్‌ను, జనసేనకు చెందిన పిర్యాదుదారులను వేర్వేరుగా ఫిర్యాదులు ఇమ్మని సిఐ అబ్దుల్ నబీ అదేశించారు. గ్రామంలో ఉద్రిక్తతలు ఏర్పడకుండా ఇద్దరు కానిస్టేబుళ్లతో పోలీస్ పికెంటింగ్ నిర్వహిస్తున్నారు.



వివాదంపై సచివాలయంలో విచారణ నిర్వహిస్తున్న పోలీసులు

**పి.వేమవరం ఘటనపై జనసేన పిర్యాదు**

సామర్లకోట మండలం పి.వేమవరం సచివాలయంలో నెలకొన్న ఘటనపై దాడి ఘటనలో జనసేన కార్యకర్తలకు గాయాలు కావడంతో సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో పెద్దాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మల రామస్వామి ( బాబు ) బుధవారం సాయంత్రం పిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వైసిపి నాయకులపై కేసు నమోదు చేసి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ బొంతు రాజేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి పిట్టా జానకి రామారావు సామర్లకోట పట్టణ అధ్యక్షులు సరోజ వాసు, తోట సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసిపి నాయకుడు కొండలరావు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు మండల వైసిపి సీనియర్ నాయకులు ఉప్పంగలకు చెందిన బిళ్ళ కుర్తి కొండలరావు బుధవారం గుండె పోటుతో మరణించారు. ఆయన పార్థివ దేహానికి ఎంఎల్ఎ పొన్నాడ వెంటకట సతీస్ కుమార్, ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్ , వేగేశ్న భాస్కర రాజు, సర్పంచ్ శాకా శంకరుడు, కాశిలక్ష్మణ స్వామి, గుత్తుల శ్రీనివాస్, దవులూరి శ్రీరామమూర్తి, టిళ్ళపూడి నాగేశ్వరరావు. మట్టపర్తి శ్రీనివాస్,ఉపసర్పంచ్ ముడికి సూజాత,పంపన సూరిబాబు నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



కొండలరావు ( ఫైల్ )

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కొత్తపేట

జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలుంటే సంబంధిత అధికారులు అడిగి తెలుసుకోవాని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి కొత్తపేట సూచించారు. బుధవారం కొత్తపేట పంచాయతీ గ్రామ సచివాలయం-5 పరిధిలో 5వ రోజు గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమా దేవి, ఎంపిపి మార్గాన గంగాధర్, గొల్లపల్లి డేవిడ్ రాజు, ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్ రెడ్డి చంటి, అధికారులు, నాయకులు,తదితరులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంఎల్ఎ చిర్ల

## నిరుపయోగంగా వాటర్ కూలర్

ప్రజాశక్తి - మామిడికుదురు

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నగరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వాటర్ కూలర్ నిరుపయోగంగా ఉంది. పంచాయతీ సచివాలయానికి వివిధ పనులపై వచ్చేవారికి తాగునీరు లేక దాహార్తితో అవస్థలు పడుచున్నారు. ప్రతి పంచాయతీ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయమని ఆదేశాలున్నా పంచా యతీ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయలేని దుస్థితి నెలకొంది. 216వ జాతీయ రహదారిలో ప్రయాణించే వారు గతంలో పంచాయతీ కూలర్ వద్ద చల్లని నీరు తాగి సేదతీరే వారు. కూలర్ నిరుపయోగంగా ఉండడంతో దాహార్తికి అలమటిస్తున్నారు.



నగరం పంచాయతీవద్దవాటర్ కూలర్

## రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల సప్త గోదావరి అభివృద్ధి పనులు రూ.50లక్షలతో ప్రారంభించనున్నారు. భీమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఇక్కడ గల సప్తగోదావరిలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. గత పుష్కరాలు సమయం లో సప్త గోదావరి అభివృద్ధి పనులు జరిగాయి. అప్పటి నుంచి సప్త గోదావరిలో మట్టి తీయలేదు. ప్రస్తుతం పురావస్తు శాఖ సప్త గోదావరి నది అభివద్ధికి రూ.50లక్షలు మంజూరు చేసిందని ఆలయ ఇఒ పి.తారకేశ్వర రావు 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఇప్పటికే చెరువులో నీరు తొలగించామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తారని ఆయన వివరించారు.నికరించ నున్న



ద్రాక్షారామలోని సప్త గోదావరి చెరువు

## రోస్టర్ పద్ధతిలో 'డిఎస్‌సి 98' పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

డిఎస్‌సి 98 ఉపాధ్యాయ పోస్టులను రోస్టర్ పద్ధతిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్ కల్పిస్తూ చేపట్టాలని ఎపి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఎస్16 ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అమలాపురం బుద్ధ విహార నందు బుధవారం సమావేశం నిర్వహించారు. . ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు బత్తుల నకులరాజు, జిల్లాప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు మాట్లాడుతూ మెరిట్ ప్రాతిపదికన నియామకాలు చేపడితే సామాజిక న్యాయం ఎలా అవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని అనుసరించి 98 డిఎస్‌సి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో నిరసన కార్యాచరణకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాధనాల సత్యనారాయణ, నేరేడుమిల్లి సత్యనారాయణ, బత్తుల రమేష్ బాబు, గెడ్డం ప్రదీప్, మంగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రెయిన్, సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొత్తపేట

మోడేకుర్రు గ్రామం నందు మండల పరిషత్ నిధుల నుంచి మంజూరైన సుమారు రూ.5 లక్షల నిధులతో డ్రెయిన్, సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎంపిపి మార్గాన గంగాధర్, జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి బుధవారం శంకుస్థాపన చేశారు అనంతరం ఎంపిపి స్కూల్ నందు జగనన్న గోరు ముద్ద పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యురాలు, ఎంపిపి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. అనంతరం భోజనల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు.